# కబ్జా

రాజిరెడ్డి, రామిరెడ్డి ఇద్దరూ ఒక్క కులమే. అయినా బంధువులు కారు. వాళ్ళ ఇళ్లు పక్కపక్కన లేకపోయినా ఒక్క ఊళ్ళోనే కొంచెం దూరంగా వున్నాయి. తరతరాలుగా వాళ్ళు ఆ ఇళ్ళల్లో వుంటున్నారు.

వాళ్ళ ఇళ్లు పక్కపక్కన లేకపోయినా వాళ్ళ పదెకరాల భూములు పక్కపక్కనే వున్నాయి. వాళ్ళ వాళ్ళ పదెకరాల పొలాలకు పుష్కలంగా పారే నీళ్ళున్న బావులు చెరొకటి వున్నాయి. పూర్వం అవి మోటబావులు. రాజిరెడ్డి తాత రామిరెడ్డి తాత పక్కపక్కనున్న బావులకు పోటీపడి తెల్లవారక ముందే లేచి మోటలు కట్టి పొలాలకు నీళ్ళు పారించేవాళ్ళు. వాళ్ళు మోటలు తోలుతూ పాడే పాటలు తెల్లవారుజామున వీచే చల్లని పిల్లగాలులతో కలిసిపోయి ఊరి వరకు వినిపించేయి. వాళ్ళకు దున్నడం మోట కట్టడం పంట పండించడం తప్ప వేరే లోకమే లేదు.

రాజిరెడ్డి తండ్రి రామిరెడ్డి తండ్రి కాలంలో మోటలు పోయి ఆయిల్‌తో నడిచే మోటర్లు వచ్చాయి. వాళ్ళు తాలుకాకు జిల్లావరకు పోయి ఆయిల్, బస్తాల్లో ఎరువులు తెచ్చేవాళ్ళు. ఒకరిని మించి ఒకరు బజారులో వచ్చే కొత్త కొత్త ఎరువులను విత్తనాలను తెచ్చి వేసి ఎక్కువ పంటను తీయాలని పోటీపడేవాళ్ళు. గ్రామస్తుల కార్యక్రమాలు విని కొత్త పద్ధతుల నుపయోగించి వ్యవసాయం చేయాలని ముందుకు దూకేవాళ్ళు.

రాజిరెడ్డి రామిరెడ్డి కాలంలో ఆయిల్ మోటార్లు పోయి కరెంటు మోటార్లు వచ్చాయి. డబ్బాలల్లో ఆయిల్ కొనుక్కవచ్చే జంఝాటం లేదు వాళ్ళకు. మీట నొక్కితే మోటర్లు నడుస్తాయి. ధారగా నీళ్ళు పోస్తాయి. మునుపటంత పనేలేదు. దాంతో రాజిరెడ్డికి రామిరెడ్డికి తీరిక ఎక్కువైంది. రాజకీయాల మీద మోజు ఎక్కువైంది. రాజిరెడ్డి ఓ పార్టీలో చేరితో పోటీపడి

రామిరెడ్డి మరో పార్టీలో చేరాడు.

రాజిరెడ్డి రామిరెడ్డి - ఇద్దరూ ఇప్పుడు ఊళ్ళో కన్నా జిల్లాలోనో పట్నంలోనో వుంటు న్నారు. వాళ్ళ తండ్రులు తాతలు పంచెలు పైకి దోపుకొని పొలం పనుల్లోకి దిగేవాళ్ళు. వాళ్ళకు ముతకబట్టలే తెలుసు. వాళ్ళ పంచెలు యేరోజు సబ్బువాసన లేని ఉతుకులతో కావిపడేయి. ఇప్పుడు రాజిరెడ్డి రామిరెడ్డి ముతకగా కనిపించే కావిరంగుల్లో వున్న ఖరీదైన ఖాదీ పంచెలు లాల్చీలు ధరిస్తారు. పార్టీల కార్యకర్తలతో తిరుగుతారు.

రాజిరెడ్డి రామిరెడ్డిల్లో ఇంత మార్పు వచ్చినా వాళ్ళ ఆడవాళ్ళల్లో ఏ మార్పూ రాలేదు. మునుపటిలాగానే వాళ్ళ అత్తలు - అత్తల అత్తలు లాగానే ముతక చీరలు పైకి దోపుకొని నాట్లు పెడ్తున్నారు. కలుపు దీస్తున్నారు. వరి కోస్తున్నారు. కల్లంలో ధాన్యం తూర్పార పడ్తున్నారు. దున్నడం మునుపటిలా వాళ్ళ వాళ్ళ భర్తలు కాక కిరాయి నాగళ్ళను పెట్టి దున్నించుకుంటు న్నారు. దున్నడం తప్ప మిగతా పనులన్నీ పంట వచ్చి ఇంట్లో పడేవరకు ఆడవాళ్ళే రెక్కలు ముక్కలయ్యేటట్లుగా కష్టపడ్తున్నారు.

ఇంటికి చేరిన ధాన్యాన్ని అమ్మే హక్కులు రాజిరెడ్డికి రామిరెడ్డిలకే వున్నాయి. ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బును తగిలేసే హక్కూ వాళ్ళకే వుంది. రాజకీయాల్లో తిరిగినప్పుడు వాళ్ళ డబ్బే ఖర్చు అవుతున్నది ఇన్నాళ్ళు. పార్టీ కార్యకర్తలతో తిరిగినందుకు తమకు ఊళ్ళో పలుకుబడి అయితే వచ్చింది. దొరగారి ఇంటికి వెళ్తే కుర్చీలో కూర్చునేంత అంతస్తు పెరిగింది. కానీ వాళ్ళకింతవరకూ పార్టీల్లో తిరిగినందుకు దమ్మిడీ లాభం కలుగలేదు. పార్టీలో ఒక్కొక్కరూ ఎట్లా బలిసిపోతున్నారో వాళ్ళు గమనిస్తూనే వున్నారు. వాళ్ళూ తమ వంతు కోసం కాచుకొని కూర్చున్నారు.

ఇంతలో రామిరెడ్డికి ఆ అవకాశం రానే వచ్చింది. ఊరి బయట చెరువు పక్కన చెరువు శిఖం అంటారు - అది పదెకరాలుంటుంది. సారవంతమైన భూమి. వానలు బాగా పడినప్పుడు కొంత భూమి చెరువు నీళ్ళతో నిండుతుంది. కాని వానలు తగ్గగానే తేలుతుంది. పచ్చని గడ్డితో సంవత్సరమంతా పచ్చగా కలకలలాడుతూ వుండే బంజరుభూమి. ఇన్నాళ్ళు ఊళ్ళో పశువులు మేపుకోడానికి పనికివచ్చేది. పోరగాళ్ళు తమ పశువులనో తమ యజమానుల పశువులనో అక్కడ మేపేవాళ్ళు. ఇన్నాళ్ళు ఊళ్ళో బాగా పశువులుండేయి. ఇప్పుడా పశువుల్లేవు. ఒక్కొక్కటీ కరువు కాటేస్తుంటె పోయాయి. ఊళ్ళో ఎవరికీ పశువులను మేపి పెంచే స్తోమతా కోరికా లేకుండా పోయాయి. దాంతో పశువులు లేకుండా పోయాయి. బంజరుభూమి మిగిలింది. దాని మీద కన్నుపడింది రాజిరెడ్డికీ రామిరెడ్డికీ. చెరి సగం ఆక్రమించుకుంటె ఏ లొల్లి వుండేది కాదేమో.

రామిరెడ్డి పదెకరాల మీద తనొక్కడే కబ్జా పెట్టాడు. అతని పార్టీ కార్యకర్తలూ అతని

పక్షంలో నిలబడ్డారు. రాజిరెడ్డికిది మహా చెడ్డ కోపం తెప్పించింది. అతని పార్టీ కార్యకర్తలు ఏం చేసే స్థితిలో లేరు. రామిరెడ్డి భూమిచుట్టూ పాతించిన రాళ్ళను ముళ్ళకంచెను తీసెయ్యా లంటే వాళ్ళు ముందుకు రావడంలేదు. అతని పార్టీ గూండాలకు భయపడ్తున్నారు. రాజిరెడ్డి గుండె గ్యాసునూనె పోసి మంట పెట్టినట్లుగా వుంది. పళ్ళు నూరాడు. గుడ్లు ఉరిమాడు.

"గిప్పుడు గా రామిరెడ్డిగాడ్ని గక్కడి నుంచి జరిపేస్తేనే నాకు నిద్దర ఒస్తది!" అని మనస్సులోనే అనుకున్నాడు.

"గిది కోపంతోటి అయ్యేపని కాదు" అని మెదడును చల్లబరిచాడు. శాంతమయ్యాడు. బాగా ఆలోచించాడు.

"ఆడిని ఊర్లో కొన్ని రోజులైన లేకుండా సెయ్యాలె! గప్పుడే గా బూమ్మీద నా కబ్జా అయితది! కానీ గది చేసేదెట్లా?" మళ్ళా ఆలోచించాడు రాజిరెడ్డి.

అప్పుడే అతని భార్య అంజమ్మ పడగ్గదిలోకి వస్తూ కన్పించింది.

అంజమ్మ నలుగురు బిడ్డలను కన్నది. అయినా ఆమెది బింకం పొంకం చెడిపోని విగ్రహం. కష్టపడి పని చేస్తుంది. ఒళ్ళు దాచుకోవడం ఆమెకు తెలియదు. అందుకే ఆమె శరీరం రాయిలా రాటుదేలిపోయి వుంది. అంజమ్మ ముక్కూ ముఖమూ బాగానే వుంటాయి. చిన్నప్పుడు గోధుమ వర్ణంలో వుండేది. కాని ఇప్పుడు ఎండలో పనిచేసి పనిచేసి ఆమె చామనచాయలో వుంది. అయినా ఆమె రంగు ఆమె అందానికేం లోపం కలిగించలేదు.

అంజమ్మ ఒంపుసొంపులు చూసేసరికి రాజిరెడ్డికి ఒక గొప్ప ఆలోచన వచ్చింది. "పొలం గట్టు మీద మాపటేల రామిరెడ్డి అంజమ్మ కొంగుపట్టి గుంజి ఆమెను బలాత్కారం చేసిండని కేసుపెట్టి ఆన్ని జెయిలుకు పంపియ్యాలి! గప్పుడే నాకు గా బూమిని కబ్జా చేస్కునేటందుకు అదను దొర్కుతది" అనుకున్నాడు.

అదే భార్యకు చెప్పాడు. అంజమ్మ విస్తుపోయింది. "నీ బుద్ధి పాడుగాను. గదేంది గాయన నన్ను గుంజందే గుంజిండని ఎట్ల సెప్పాలె! నన్ను గుంజిండని గా పోలీసోల్లందరికీ సెప్తే నలుగురి ముందల నా మానం పోదా?" అంది.

"నీ మానం ఎందుకుపోతదే! నేనున్నగద నిన్ను చూస్కునేటందుకు" నవ్వాడు రాజిరెడ్డి.

"గిదెక్కడి కతనో ఏందో? రామిరెడ్డి ఎన్నడూ నా దిక్కు కన్నెత్తయినా సూడలేదు! గంత పెద్దమాట ఎట్ల సెప్పమంటవ్! గాయన పెండ్లం నేనూ పక్కపక్క పొలంలో పని జేస్కుంటం! అక్కా! అక్కా! అనుకుంట మంచిగనే వుంటం. మళ్ళ గిప్పుడు గట్ల ఎక్కడిలేని ముచ్చట ముందలేసుకొని రామిరెడ్డి నన్ను గుంజిండు బలాత్కారం చేసిండు అని నానోటికెట్ల ఒస్తది! గిదంతా నాకెందుకో మంచిగనిపిస్తలేదు! గిదంతా మానుకోవయ్యా!" అని అంజమ్మ బతిమిలాడింది కూడా. రాజిరెడ్డికి భార్య తన మాట కాదంటున్నందుకు కోపం వచ్చింది.

"నోరు మూస్కొని నేను సెప్పింది సెయ్యి! తెల్సిందా! గండ్లనే మనకు మంచి జర్గుతది. గీ నడుమ రామిరెడ్డి నన్ను సంపుతనని ఎగురుతుండు- నీకు తెలుసా ఏమైన? వాని పొగరు అణగదొక్కాలంటె గిదే వుపాయం! మళ్ళ మారు మాట్లాడకుండ నేను సెప్పింది సెయ్యి!" అన్న రాజిరెడ్డి మాటలకు అంజమ్మ భయపడిపోయింది.

తను భర్త చెప్పినట్లు చేయకపోతే భర్త ప్రాణాలకే ముప్పు వచ్చేటట్లున్నది! అని అంజమ్మ ఆలోచించి సరే అన్నట్లుగా తలూపింది.

తెల్లవారగానే రాజిరెడ్డి పోలీసుస్టేషనుకు పోయి రిపోర్టు రాయించాడు. పోలీసులు రామిరెడ్డిని అరెస్టు చేసారు. అంజమ్మను ఎన్నో ప్రశ్నలడిగారు. అంజమ్మ భర్త నేర్పినట్లుగానే తొణక్కుండా చెప్పింది -

"నిన్న పొద్దుగూకే యేల గీ రామిరెడ్డి నా పైటకొంగు పట్టి గుంజిండు. నేను లొల్లి పెట్టకుండ నా నోరు గట్టిగ సేత్తో మూసిండు. గడ్డి కుప్ప సాటుకు గుంజుకపోయి బలాత్కారం సేసిండు. నా మానం మంట గలిపిండు" అనేసరికి అంజమ్మకు తన మానం నలుగురి ముందు పోయినట్లుగానే అనిపించి ఏడ్చింది. "రైకంతా చింపేసిండు! నా గాజులు పగిలిపోయి నయి. నా సేతులన్నీ రగ్తం రగ్తం అయినయి" అని అంజమ్మ చిరిగిపోయిన ఒంటి మీది రవికను చేతుల మీద రక్తం గడ్డ కట్టుకపోయిన చారికలను చూపించింది.

అంజమ్మ కళ్ళల్లో ఏదో భయం. మాటి మాటికి భర్తవైపు - "గిదంత బాగలేదు! ఎందుకు గీ అబద్ధాలు!" అని బతిమాలుడుతున్నట్లు చూసింది.

అయినా రాజిరెడ్డి పట్టించుకోలేదు. ఆయన మనస్సంతా వేరే ఆలోచనలతో నిండి వుంది. పదెకరాల బంజరుభూమి తన కబ్జాలోకి రావడానికి ఎంతో కాలం లేదని ఉత్సాహంగా వున్నాడు.

రాజిరెడ్డి డాక్టరమ్మను కూడగట్టుకొని అంజమ్మ మీద బలాత్కారం జరిగినట్లుగా సర్టిఫికెటు సృష్టించాడు.

కోర్టులో బోనులో నిలబడి అంజమ్మ ఇంతకుముందు పోలీసులకు చెప్పినట్లుగానే మళ్ళా చెప్పింది. కోర్టులో అంతమంది ముందు తన మీద జరిగిన బలాత్కారాన్ని వర్ణించి చెప్తుంటే ఆమెకు మరోసారి తన మానం పోయినట్లే అనిపించింది. అవమానం నిజంగానే జరిగినట్లుగా భావించింది. ఆమెకు దు:ఖం ఉప్పొంగింది. అయినా ఇదంతా తన భర్త కోసం చేస్తున్నాన్న ఆలోచన రాగానే తన దు:ఖాన్ని, అవమానాన్ని దిగమింగుకుంది. భర్తవైపు చూసింది. ఆయనకిదంతా పట్టినట్లు లేదు. లాయర్లు మాటిమాటికడిగే ప్రశ్నలకు "రామిరెడ్డి నన్ను గుంజిండు బలాత్కారం చేసిండు" అని నిశ్చలంగా చెప్తూ పోయింది. అట్లా చెప్తుంటె కోర్టులో అందరూ గుసగుసలు పెట్టుకుంటున్నట్లుగా ఒక దిగజారిన స్త్రీని చూసినట్లు అసహ్యంగా

చూస్తున్నట్లుగా అంజమ్మ కనిపించింది. ఆమెకు ఒళ్లంతా తేళ్ళు జెర్రులు పాకుతున్నట్లుగా వుంది.

"ఇంటికి పోయినంక తల మీది నుంచి స్నానం చెయ్యాలె" అనుకుంటూ అంజమ్మ కోర్టులో లాయరు పక్కన కూర్చున్న భర్తవైపు చూసింది.

ఆయన గెలుపు ఖాయమని ఆనందంగా వున్నాడు! అంజమ్మ స్థితి ఎట్లా వుందో పట్టించుకున్నట్లు లేదు. అంజమ్మ తల దించుకుంది.

లాయరు ప్రశ్నలడుగుతున్నప్పటి నుంచి ఏదో అపవిత్రతను చూస్తే - వింటే కలిగే వికారం ఆమెలో కలిగింది. నోట్లో ఊరే ఉమ్మును మింగబుద్ధి కాలేదామెకు.

కోర్టు నుంచి బయటికి వచ్చింతర్వాత ఆమె చక్కగా భర్త దగ్గరికి పోయింది. నోట్లో వున్న ఉమ్మును తుపుక్కుమని అతని మీద ఉమ్మేసింది. అక్కడి నుంచి గబగబ నడిచింది.

రాజిరెడ్డి నిర్ఘాంతపోయాడు. ముఖం మీది ఉమ్మునైన తుడుచుకోవాలన్న ధ్యాస లేకుండా పోయింది అతనికి. గబగబ వెళ్ళిపోతున్న అంజమ్మవైపు నోరు తెరిచి చూస్తుండి పోయాడు.

*("చాటింపు" అక్టోబరు 15, 1997 పక్షపత్రికలో ప్రచురితమైంది)*

* * *